

# పుస్తక పరిచయం




Sahiti Prachuranalu
33-22-2, Chandram Buildings
CR Road, Chuttagunta
VIJAYAWADA- 520 004
81210 98500

**ప్రయాణం** బావుంటుంది. తెలిసిన వాళ్ళతో, తెలిసిన త్రోవల్లో ప్రయాణించడం అదొక అనుభవం. ఆహ్లాదం అనిపించవచ్చు, సౌకర్యవంతంగా తోచవచ్చు. తెలీని త్రోవల్లో , తెలీని ప్రదేశాల్లో, తెలీని పరిసరాల్లో ప్రయాణంలో థ్రిల్ ఉంటుంది. తెలీని దారుల్లో పరిచయమయ్యే 'వాళ్ళు' ఎన్నో పాఠాలు చెబుతారు, జీవితంలో అంతవరకూ చూడని ఎన్నో కోణాల్ని చూపిస్తారు.

అలాంటి అనుభవాలకోసం, ఈ లౌకిక ప్రపంచంలో అలౌకిక ఆనందాన్ని పొందడం కోసం ఓ 'పాదచారి' చేసిన అలౌకిక ప్రపంచ దర్శనం ఈ 250 పేజీల గ్రంథం. తెలుగు సాహిత్యంలో ఇలాంటి ప్రక్రియలో ఒక పుస్తకం రావడం బహుశా ఇదే మొదటిసారి ఐ వుంటుంది. మూసపద్ధతిలో సాగే ట్రావెలోగ్స్ లో ఎక్కువగా ప్రదేశాల, ప్రయాణాల వివరాలుంటాయి. ఈ 'వాళ్ళు' ఒక విధంగా యాత్రాస్మృతే కానీ ఇందులోని సందర్భాలూ, సన్నివేశాలూ అన్వేషణాత్మకంగా ఉంటాయి. "నిత్య జీవితంలో ఏది అన్వేషించాలి?". జగమంతా నిండిన 'నేను'ని. అలా ఓ యువకుడు ఏదో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో ఒకసారి మంచుకొండల్లో, మరోసారి మండుటెడారిలో సాగించిన ప్రయాణమే ఈ 'యాత్ర'. ఇది కల్పిత కథ కాదు, కాలక్షేపం కోసం వ్రాసింది అంతకన్నా కాదు. ఈ 'యాత్ర'లోని అనుభవాలన్నీ పరిచయం అవసరం లేని ప్రసిద్ధరచయిత భువనచంద్రగారి స్వానుభవాలు. వ్యక్తిగత సమాచార పరిరక్షణాకోణంలో 'యాత్ర'లో ఆయన కలుసుకున్న 'వాళ్ళ' పేర్లు మార్చానని రచయితే చెప్పారు. భువనచంద్రగారిని సినీగీత రచయితగానే ఎరిగిన వాళ్ళకు ఈ పుస్తకంలో భువనచంద్రగారి రచనల్లో, ఆయన ఆలోచనల్లో, ఆయన దృక్పథంలో ఒక వినూత్నమైన కోణం కనిపిస్తుంది.

ఇందులోని ఖండికలన్నీ 'స్వప్న' అనే మాసపత్రికలో ధారావాహికంగా వచ్చినవే. రెండు భాగాలుగా ఆ పత్రికలో నెలనెలా ప్రచురితమయ్యాయి. ముందుగా రచయిత పేరు చెప్పకుండా 'పాదచారి' అనే పేరుతోనే ప్రచురించి కొంతకాలమయ్యాక భువనచంద్రగారి పేరు బహిర్గతం చేయడం జరిగింది. ఇందువల్ల పాఠకులు నిష్పాక్షికంగా ఈ ధారావాహికను చదివే అవకాశం కలిగింది, తొలినుంచే అనూహ్యమైన స్పందన లభించింది. 'వాళ్ళు' పరిచయమైన ప్రతి సన్నివేశంలో భువనచంద్రగారు వ్యక్తపరచిన భావాలు - ఆలోచనల లోతులు ఈ పుస్తకాన్ని ఓ స్థాయిలో నిలబెట్టాయి. పుస్తకం చదువుతున్నంత సేపూ పాదచారి భువనచంద్రగారితో కలిసి మనమూ హిమాలయ పర్వతసానువుల్లో, గడ్డకట్టే చలిలో 'వాళ్ళందర్నీ' కలుసుకుంటాం, వాళ్ళు పెట్టింది తింటాం, చెప్పింది వింటాం. జీవితంలో ఎన్నో కొత్తసత్యాలను తెలుసుకుంటాం. ఎడారి త్రోవల్లోనూ ఇవే అనుభవాలు. పాదచారికి లభించిన అలౌకిక అనుభవమే కాదు, ఈ 'వాళ్ళు' చదివిన పాఠకులు కూడా ఒకానొక అలౌకిక తాదాత్మ్యతకు లోనౌతారు.

★★★



# పుస్తక పరిచయం




Mobile : 9393662821
*rcksrajulic@gmail.com*

**కథారచయిత** ఆర్.సి.కృష్ణస్వామి రాజుగారు కౌముది పాఠకులకు సుపరిచితులే. సమకాలీన తెలుగు కథారచయితల్లో తనదైన ఒక శైలిని ఏర్పరచుకుని, సొంతగొంతుతో పాఠకుల ముందుకు తన కథలను తీసుకువచ్చే వారిలో తప్పక పేర్కొనవలసిన రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజుగారు. కథాశీర్షిక దగ్గరనుంచి, పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలు, మాండలీకం.. అన్నింటిలోనూ వైవిధ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. పెద్ద హడావిడి,, గందరగోళం లేకుండా మొదలయ్యే కథలు మనల్ని ఆ వాతావరణంలోకి ఇట్టే తీసుకెళ్తాయి. కృష్ణస్వామి రాజుగారు ఎంపికచేసుకున్న కథాంశాల్లో ఏ మాత్రం కృత్రిమత్వం కనిపించదు. ఖచ్చితంగా వీరంతా రచయితకు ఎదురైన వ్యక్తులే ఈ కథల్లో పాత్రలయ్యారనిపిస్తుంది. ముందుమాటలో రచయిత చెప్పారదే " ఈనాడు విలేకరిగా పనిచేసినప్పుడు, ఎల్.ఐ.సి.లో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసినప్పుడు సమాజంలోని వివిధ వర్గాలవారితో పరిచయమవడం, సాంఘిక సమస్యల మూలాలు తెలుసుకోవడం, ఆరేళ్ళపాటు పల్లెల్లో పర్యటించడం" ఇవన్నీ తమ మానసిక వైశాల్యానికి దోహదం చేశాయని. ఇందులోని 16 కథలూ జీవితంలోనుంచే వచ్చాయని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. చీరకట్టుతో 43 రన్ లో విజయం సాధించిన కమల, పుట్టిన పదిరోజులకే చనిపోయిన కూతురి గుర్తుగా గుడ్డపీలిక దాచుకున్న ముద్దుకిష్టడి అమ్మ, ఇంకా.. మెల్లకన్ను మనోరమ, చిన్న గుత్తికాయ సిద్ధన్న, పొట్టి జడల పద్మ.. వీళ్ళంతా కథల్లోని పాత్రలు కాదు, పాఠకుల కళ్ళముందు నిలిచే సజీవమూర్తులు. తన బాల్యంలో తల్లి తనపై ఎంత ప్రభావాన్ని చూపించిందో - ముందుమాటలో వ్రాసుకున్నారు రచయిత. అందుకనే నేమో అమ్మగురించిన కథలు ఎక్కువగా కనిపిస్తాయి. ఎక్కడ అమ్మ ప్రసక్తివచ్చినా మనసు తడిచేసే సన్నివేశాలు అల్లడం కూడా రచయిత ప్రత్యేక శైలిలో ఒక భాగమే. కథాశీర్షికల్లో కూడా అమ్మ తరచూ కనిపిస్తుంది - అమ్మా, నీకు దండమే; అమ్మా! ఆకలే!!; అమ్మా! నారాయణమ్మా!!; అమ్మ సినిమాకి వెళ్ళాలంటోంది.. ఇలా. ముందుమాటలో ఎమ్వీ.రామిరెడ్డిగారు చెప్పినట్లు "దయచేసి మీరీ కథలు చదవండి / జీవితాన్ని కౌగిట్లోకి తీసుకోండి/ తల్లివేర్లను తలపుల్లోకి తెచ్చుకోండి/ భయమనే వైరస్ ను చంపేసి మళ్ళీ మనుషులకు దగ్గరవండి.!! "

★★★

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**